క్లుప్తంగా

స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాకు చెందిన సింగరేణి, మాజీ సింగరేణి ఉద్యోగులతో పాటు ప్రాజెక్ట్ ప్రజావిత, పునరావాస, పరిసర గ్రామాల నిరుద్యోగ యువతకు సింగరేణి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ రీజనల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రీన్యూర్‌షిప్, తెలంగాణ స్టేట్ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రీన్యూర్‌షిప్ సహకారంతో మొత్తం 38 కోర్సులతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కాస్మోటిక్, డ్రోన్, సోలార్, సెల్ టెక్నీషియన్స్, టూవీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి కోర్సులకు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏరియాకు చెందిన 42 ఏళ్ల లోపు యువతీ యువకులు తమ దరఖాస్తులను www.scclmines.com వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత నకలుతో పాటు సర్టిఫికెట్లను జతచేసి ఏరియా ఎంవీటీసీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తిగల నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

భద్రాద్రిని అభివృద్ధి చేయాలి

భద్రాచలంఅర్బన్: యాదాద్రి లక్ష్మీనరసింహాస్వామి ఆలయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన విధంగా భద్రాచలం దేవస్థానాన్ని అభివృద్ధి చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భద్రాచలం బీఆర్ఎస్ మండల నాయకులు రమేష్ గౌడ్ కోరారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. భద్రాచలం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు వెంటనే సీఎం రేవంత్ రెడ్డి నిధులను విడుదల చేయాలని, కరకట్ట నిర్మాణంకు సంబంధించి గత ప్రభుత్వం విడుదల చేసిన టెండర్ ప్రక్రియలోనే పనులను త్వరతగతిన పూర్తి చేయాలని అన్నారు. వరదల కారణంగా ముంపునకు గురి అవుతున్న భద్రాచలం పట్టణాన్ని కాపాడాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు.

ఎమ్మెల్యేకు వినతి

దమ్మపేట: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణను జిల్లా సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పాడ్య నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని గండుగులపల్లిలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి, రానున్న డీఎస్సీలో వెయిటేజి మార్కులు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ జిల్లా అధ్యక్షుడు బాణావత్ సేవ్యా తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

బూర్గంపాడు: జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోదావరి వరద బాధిత కుటుంబాలకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు పెద్దగొని ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం చింతల లక్ష్మీనగర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బూర్గంపాడు మండలంలోని వరద ముంపు ప్రాంతాల ప్రజలకు కృష్ణసాగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములను కేటాయించి అన్ని వసతులతో కూడిన ఇళ్లను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఊష్లా, రాపర్తి లక్ష్మి, కణతాల ధనలక్ష్మి, లత, సాధన, రవి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో న్యాయ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ కోరారు. గిరిజన అభ్యుదయ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి చిచ్చడి శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాయం సత్యనారాయణ మాట్లాడారు. మర్మం చిట్టిబాబు, దుర్గారావు, సోయం కామేష్, తదితరులు పాల్గొన్నారు.

దళితబంధుపై నిర్ణయం తీసుకోండి

మణుగూరురూరల్: క్యాబినెట్ సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దళితబంధుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ రాష్ట్ర దళితబంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రెండో విడత దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

సీహెచ్‌సీకి సిబ్బంది కొరత

- ఆస్పత్రిలో లేని గైనకాలజిస్ట్
- 60 కిలోమీటర్ల దూరంలోని భద్రాచలమే దిక్కు
- కేటాయించినా భర్తీకాని నర్సుల పోస్టులు



చర్లలోని సీహెచ్‌సీ వైద్యశాల

చర్లరూరల్: చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి సీహెచ్‌సీకి గైనకాలజిస్టుతో పాటు మరో ఎంబిబియస్ డాక్టర్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. చర్ల పూర్తి ఏజెన్సీ ప్రాంతం కావడంతో వైద్యంకోసం చర్ల సీహెచ్‌సీ రావాల్సిన పరిస్థితి నెలకొంది. చర్ల వైద్యశాలలో గైనకాలజిస్టు లేక పోవడంతో ఏజన్సీలో నివసిస్తున్న గర్భిణులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 60 కిలో మీటర్ల దూరంలో ఉన్న భద్రాచలం ఏరియా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి. చర్ల మండలంలోని అనేక గిరిజన గ్రామాలకు కనీస రవాణా సౌకర్యం అందుబాటులో లేక అత్యవసర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితుల్లో గర్భిణులను కర్రల సాయంతో జడ్డీల ద్వారా చర్లకు తీసుకువచ్చిన ఘటనలు లేకపోలేదు. ఆ సమయాల్లో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో నివసించే గిరిజనుల కోసం చర్ల సీహెచ్‌సీకి గైనకాలజిస్ట్‌ను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా ఈ ఆస్పత్రిలో ఇటీవల 14 మంది స్టాఫ్ నర్సులను కేటాయించినప్పటికీ ఇంతవరకు భర్తీ చేయకపోవడంతో ఉన్న వారితోనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం చర్ల మండలంలో విజృంభిస్తున్న వైరల్ ఫీవర్లతో ప్రభుత్వ ఆసుపత్రులకు జనం క్యూ కట్టారు. ఒక్క చర్ల సీహెచ్‌సీకే రోజుకి 200 మందికి పైగా వివిధ రకాల చికిత్సలకోసం వస్తుండడం విశేషం. అంతేకాకుండా ఆస్పత్రికి వాచ్‌మెన్ లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో విధులు నిర్వహించాలంటే స్టాఫ్ నర్సులు కొంతమంది ఆకతాయిలు చేసే పనులకు ఇబ్బందులకు గురవుతున్నారు. చర్ల మండల కేంద్రంలో ఉన్న సీహెచ్‌సీలో రక్త పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గైనకాలజిస్టుతో పాటు మరో ఎంబీబీయస్ వైద్యుడిని మరియు సిబ్బంది నియమించాలని కోరుతున్నారు.

మరో డాక్టర్‌ను నియమించాలి

చర్ల మండలంలోని జనాభా దృష్ట్యా చర్ల సీహెచ్‌సీకి మరో ఎంబీబీఎస్ డాక్టర్‌ను నియమించాలి. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉన్నందున ప్రభుత్వం కేటాయించిన స్టాఫ్ నర్సులను నియమించాలి. రక్త పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రక్త నమూనాలను ఇక్కడే సేకరించే విధంగా ఉండాలి.

– గునూరి రమణ, చర్ల

ప్రభుత్వం స్పందించాలి

చర్ల సీహెచ్‌సీలో గైనకాలజిస్టును వెంటనే నియమించాలి. ఎన్నో వ్యయ ప్రయాసలు పడి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాచలం ఏరియా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే ఇబ్బంది. వెంటనే ప్రభుత్వం స్పందించి గైనకాలజిస్టుతో పాటు సిబ్బందిని నియమించాలి.

– కారం నరేష్, చర్ల

ప్రతిపాదనలు పంపించాం

ఇక్కడి ఆస్పత్రి సమస్యల పరిష్కారానికి ప్రతిపదనలు పంపించాం. రాష్ట్ర స్థాయి అధికారుల నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం. అందులో భాగంగానే స్టాఫ్ నర్సుల కేటాయింపు జరిగింది. అతి త్వరలో డాక్టర్లు, మిగతా స్టాఫ్ వచ్చే అవకాశం ఉంది.

– జి.రవిబాబు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల ప్రధాన సమన్వయ అధికారి

ముమ్మరంగా సీఎం సభ ఏర్పాట్లు



సభ ఏర్పాటు పనులు ఇలా..



హెలిప్యాడ్‌ను సిద్ధం చేస్తున్న సిబ్బంది

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ మణుగూరులో జరగనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నేటి సాయంత్రమే సీఎం సభ కావడంతో ఆర్‌అండ్‌బి, సింగరేణి, పోలీస్, ఇతర శాఖల ఆధ్వర్యంలో అధికారులు పనులను వేగవంతంగా చేపడుతున్నారు. సీఎం రాక నేపథ్యంలో రెండు హెలిప్యాడ్ పనులను సైతం అధికారులు సిద్ధం చేస్తున్నారు. హెలిప్యాడ్, సభా వేదిక పనులను ఎప్పటికప్పుడు మణుగూరు డీఎస్పీ వంగ రవీంధర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నేటి సాయంత్రం లోపు ఏర్పాట్లు అన్ని పూర్తి చేసేందుకు అధికారులు ఆయా పనుల్లో బిజీ బిజీగా నిమగ్నమైపోయారు.

అప్రమత్తమైన అధికారులు

బూర్గంపాడు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలం, మణుగూరు పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, ఎస్పీ రోహిత్‌రాజ్‌లు సీఎం పర్యటనకు ముందస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఏ శరత్, పోలీస్‌శాఖ వరంగల్ రేంజ్ ఐజీ ఏవీ రంగనాథ్‌లు ఆదివారం సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. వీరికి కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు యడమకంటి రోశిరెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు



కరకగూడెం: వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేగా కాళిక

కరకగూడెం: ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే అనేక అనర్థాలకు దారితీసే అవకాశాలు ఉన్నాయని కరకగూడెం మండల ఎంపీపీ రేగా కాళిక అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆమె ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో భద్రాచలం మిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉచితంగా రోగులను పరీక్షించి నాణ్యమైన మందులు అందిచడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం వైద్య బృందం సుమారు 500 మందిని పరీక్షించి పలువురికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో మిమ్స్ హాస్పిటల్ వైద్యులు చల్లా హరీష్, బాల నరసింహుడు, ఎం.గురుతేజ, మేనేజ్మెంట్ మెంబెర్ కావ్య, వైస్ ఎంపీపీ ఎలిపెద్ది శైలజ, సమత్ భట్టుపల్లి మాజీ సర్పంచ్ పోలెబోయిన శ్రీవాణి, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ఉంటేనే మార్కెటింగ్ అవకాశాలు

మణుగూరురూరల్: వృత్తి నైపుణ్యతతో చేతివృత్తులతో తయారు చేసే ఉత్పత్తుల నాణ్యతకే చక్కటి మార్కెంటింగ్ అవకాశాలు ఉన్నాయని, అందుకు తగ్గ డిమాండ్ కూడా ఉందని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. ఆదివారం పీవీకాలనీ సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు జనపనార బ్యాగుల ఉచిత శిక్షణ కేంద్రం ముగింపు కార్యక్రమానికి ఏరియా జీఎం రామచందర్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలు తయారు చేసిన జనపనార బ్యాగులను పరిశీలించారు. అనంతరం తక్కువ సమయంలో మహిళలకు బ్యాగుల తయారీలో చక్కని నైపుణ్యతను ప్రదర్శించిన శిక్షకురాలు పద్మావతిని ఏరియా జీఎం రామచందర్-ఏరియా సేవ అధ్యక్షురాలు సుమతి దంపతులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జీఎం దంపతులను, శిక్షకురాలిని మహిళలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి ఎస్.రమేష్, సింగరేణి సేవా సమితి అధికారి ఎస్.శ్రీనివాస్, లేడిస్ క్లబ్ సభ్యులు వీసం రమాకృష్ణయ్య, బి.కవిత, పి.అరుణ, లక్ష్మి, సీహెచ్.సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు చేయూతనివ్వాలి

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడిన మలిదశ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి చేయూతనందించి ఆదుకోవాలని మలిదశ ఉద్యమకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు తోడేటి సత్యనారాయణ కోరారు. ఆదివారం సారపాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు 2011 మార్చి 10వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సాధనలో భాగంగా చేపట్టిన మిలియన్‌మార్చ్‌లో పాల్గొన్న ఉద్యమకారులు ఆదివారం సారపాకలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమ కాలం నాటి పోరాటస్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భద్రాచలం, మణుగూరులలో పర్యటించనున్న సందర్భంగా మలిదశ ఉద్యమకారుల డిమాండ్లపై సానుకూల ప్రకటన చేయాలన్నారు. మలిదశ ఉద్యమకారులకు ప్రభుత్వ భూములలో ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొక్కొండ ప్రసాద్, పారుపల్లి శ్రీనివాస్, దాసరి సాంబ, పేరాల శ్రీనివాసరావు,దార వెంకటరాములు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



కరకగూడెం: మాట్లాడుతున్న ఇక్బాల్ హుస్సేన్

బూర్గంపాడు: ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టేందుకు సోమవారం మణుగూరుకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా దీవెన సభను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. ఆదివారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బర్ల నాగమణి, మందా నాగరాజు, భజన సతీష్, యడమకంటి సుధాకర్‌రెడ్డి, ఎండి.ఘని, గుండె వెంకన్న పాల్గొన్నారు.

కరకగూడెం: నేడు పినపాక నియోజకవర్గ కేంద్రమైన మణుగూరు పట్టణంలో నిర్వహిస్తున్న ప్రజాదీవెన బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్టీ మండల నాయకులు తోలెం నాగేశ్వరరావు, ఎర్ర సురేష్, జలగం కృష్ణ, రఫీ, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: నేడు మణుగూరులో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం సందర్భంగా జరుగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే ప్రజా దీవెన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని మొండికుంట గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నెల్లిపాక పీఏసీఎస్ చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: నేడు సోమవారం మణుగూరులో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, జిల్లా సమితి సభ్యులు ఆర్.లక్ష్మీనారాయణ, ఎస్‌కె.సర్వర్, పట్టణ కార్యదర్శి డి.సుధాకర్, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, ఏఐటీయూసీ మండల నాయకులు రాయల బిక్షం, జి.వెంకటేశ్వర్లు, నాయుడు, రాములు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే

ములకలపల్లి: నేటి నుండి లెప్రసీ కేస్ డిటెక్షన్ ప్రోగ్రాం (ఎల్‌సీడీసీ) ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు స్థానిక మంగపేట గిరిజన ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి సాయికల్యాణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో భాగంగా ప్రతీ గ్రామంలో స్థానిక ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరిస్తారు. ఒంటిపై రాగిరంగులో మచ్చలు ఉన్న వ్యక్తులను గుర్తించి, పీహెచ్‌సీ కేంద్రానికి నివేదిక అందజేస్తారు.

పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాలకు చెందిన గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. మండల కేంద్రంలోని గాంధీ సెంటర్, లక్ష్మీకాలనీ, పెట్రోల్‌బంక్ సెంటర్లతో పాటు చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన ఉంజుపల్లిరోడ్, తాలిపేరు ప్రాజెక్టు, పెదమిడిసిలేరుక్రాస్‌రోడ్, కుర్నపల్లి రోడ్‌లలో మోహరించిన పోలీసులు వచ్చిపోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి వారిని విడిచిపెట్టారు. సీఐ ఏ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డిలు తనిఖీలను కొనసాగించగా, సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను విడనాడాలి

ములకలపల్లి: మనుషులు మూఢనమ్మకాలను విడనాడి ఆధునిక విజ్ఞానతత్వాన్ని అలవర్చుకోవాలని భారత హేతవాద సంఘ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని సుబ్బనపల్లిలో ఆదివారం సంఘ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ప్రాంతీయ హేతువాద మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రజలు మతవిశ్వాసాలను వదిలి మనవతావాదాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం సంఘ మూడు జిల్లాల నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా షేక్ నభీసాహెబ్, ప్రధాన కార్యదర్శిగా పి. క్రాంతి ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘ ట్రెజరర్ షేక్ బాబు, ఎస్‌కె.నభీసాహెబ్, పి. క్రాంతి, రాంచందర్, రామనాథం, డాక్టర్ భానుప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం



ములకలపల్లి: మృతుని తల్లిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను తప్పనిసరిగా అందజేస్తామని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెల్లడించారు. ఆదివారం మీ ఎమ్మెల్యే, మీ ఇంటికి కార్యక్రమంలో భాగంగా, మండలంలోని నర్సాపురం, పెంట్లం, అన్నపురెడ్డిపల్లి, ఊటుపల్లి, పెద్దిరెడ్డిగూడెం, బీమునిగూడెం తదితర గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. పర్యటనలో ఎమ్మెల్యేకు పలువురు, వారి గ్రామ సమస్యలపై వినతి పత్రములను అందజేయగా, సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, ఎంపీడీఓ మహలక్ష్మి, నాయకులు వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వరరావు, దుబాకుల రాము, వేముల రమణ, నాగేశ్వరరావు, లక్ష్మారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారే పరామర్శ

ములకలపల్లి: అకాల మృత్యువాతపడ్డ ములకలపల్లి అంబేత్కర్‌నగర్ యువకుడు ఖమ్మంపాటి నాగరాజు (పండు) కుటుంబసభ్యులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం పరామర్శించారు. నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుని తల్లిదండ్రులు ఖమ్మంపాటి తిరుపతమ్మ, ముత్తేషులను ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తొలుత చలమన్ననగర్, కమలాపురం, సత్యంపేట, రాజుపేట గ్రామాల్లో ఎమ్మెల్యే ఆదినారాయణ విస్తృతంగా పర్యటించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, సొసైటీ డైరెక్టర్ అనుమల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కారం సుధీర్. గుంపుల రవితేజ, శనగపాటి అంజి, పువ్వాల మంగపతి, పువ్వాల లలితారావు, గాడి తిరుపతిరెడ్డి, శ్రీరాముల నాగేశ్వరరావు, కోట్టే శ్రీను, కాళ్ల నర్సింహారావు, గంటా శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ కార్యాలయంలో అక్రమాలు'

దుమ్ముగూడెం: మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు విమర్శించారు. ఆదివారం మండలంలోని దబ్బనూతులా గ్రామంలో జరిగిన ఆ సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలకు చెందిన భూములకు పట్టా పాస్ పుస్తకాలు కావాలంటే సవాలక్ష కొర్రీలు పెడుతున్నారని, గిరిజనేతరులకు మాత్రం పాస్ పుస్తకాలు మంజూరు అవుతున్నాయని అన్నారు. వీటిపై జిల్లా అధికారులు దృష్టి పెట్టి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత అధికారిని వివరణ అడిగితే అనుమతి లేదని సమాధానం ఇచ్చారని, కానీ యథేచ్ఛగా ఇసుక రవాణా సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, రమేష్, నరేష్, బాలకృష్ణ, అరుణ్, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో చిన్నారుల ప్రతిభ

దుమ్ముగూడెం: మండలానికి చెందిన పలువురు చిన్నారులు తైక్వాండో కరాటేలో ప్రతిభను చాటారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి తైక్వండా కరాటే ప్రతిభా పోటీల్లో కరాటే కోచ్ బన్నీ మాస్టర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు ప్రతిభను కనపరిచి విజేతలుగా నిలిచారు.ఈ పోటీలలో దుమ్ముగూడెం మండలం నుండి రెహాన్, షహానా, వసుధ, వర్షిణి, యశోద, సంతోష్, అశ్విన్, జస్విత, అక్షయ్ దీప్తి, అనూష, అభిషేక్‌లు పోటీల్లో తమ సత్తా చాటారు. మారుమూల ప్రాంతంలో చిన్నారులను తీర్చి దిద్దిన కోచ్ బన్నీ మాష్టర్‌ను పలువురు అభినందించారు.

ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1968–69 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని, విద్యార్థులు ఆదివారం భద్రాచలం పట్టణంలోని గుప్తా ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. దాదాపు 55 ఏళ్ల తరువాత 28 మంది పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట చేరడంతో సందడి నెలకొంది.

పాలకవర్గాన్ని నియమించాలి

అశ్వారావుపేటరూరల్: రజక ఫెడరేషన్ ఏర్పాటై 40 ఏళ్లు పూర్తయినప్పటికీ నేటికీ ఫెడరేషన్‌కు పాలక వర్గాన్ని నియమించకపోవడం శోచనీయమని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక పాత ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టి పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మండల అధ్యక్షుడు బుక్కురి బుజ్జిబాబు మాట్లాడారు. అల్లాడి ఆదినారాయణ, రామ్‌సాయి, తలుపులు నాగేశ్వరరావు, అల్లాడి నారాయణ, గుమ్మడి అప్పన్న, గుమ్మడి శ్రీను, బండి కృష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

అశ్వాపురం: మండల కేంద్రంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పొంగులేటి స్వరాజ్యం-రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ (పీఎస్‌ఆర్) ఆధ్వర్యంలో భద్రాచలం కిమ్స్ ఆస్పత్రి వారి సౌజన్యంతో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 400 మంది రోగులకు వైద్యులు షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. భీంరెడ్డి బాబురెడ్డి, చావా రామకృష్ణ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ములకలపల్లి: చౌటిగూడెం గ్రామంలో కొమరంభీం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీల విజేతలకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును బహుమతి ప్రదానోత్సం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మెచ్చా మాట్లాడారు. యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని అన్నారు. న్యాయవాది, ఆదివాసీ సేన నాయకులు, క్రీడల నిర్వాహకులు ఊకే రవి, టీఆర్ఎస్ మండల అద్యక్షుడు మోరంపూడి అప్పారావు, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు కీసరి శ్రీను. కీసరి వెంకటేశ్, పామర్తి వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

లింగమూర్తి మృతికి సంతాపం

మణుగూరురూరల్: మండలానికి చెందిన సీనియర్ వంట మాస్టర్ లింగమూర్తి ఆదివారం అకాల మృతి చెందాడు. ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, గాండ్ల సురేష్, డాక్టర్ దుస్సా సమ్మయ్య, మల్లిడి లాలయ్య, త్రిమూర్తులు వారి గృహానికి వెళ్లి లింగమూర్తి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.